

పంట నష్టాన్ని పూర్తిగా నమోదు చేయాలి

ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - యలమంచిలి

తుపాను ప్రభావంతో ముంపునకు గురై దెబ్బతిన్న పంటలను పూర్తిగా నమోదు చేయాలని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం కాంబొట్లపాలెం, గుంపర్రు, చించినాడ, ఇలపకుర్రు తదితర గ్రామాల్లో పర్యటించారు. ముంపునకు గురైన వరి చేలు, ధాన్యం రాశులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల్లో ధాన్యం తూకంలో మూడు నుంచి 8 కేజీలు వ్యవసాయ అధికారులే అదనంగా అడగడం దారుణమన్నారు. పంటనష్టపోయిన ప్రతిరైతునూ ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

68 వేల ఎకరాల్లో పంటనష్టం
347 గ్రామాల్లో 41 వేల ఎకరాల్లో దెబ్బతిన్న వరిపంట
వరి, మొక్కజొన్న, మినుము, పెసర, వేరుశెనగ, పొగాకు, పత్తి పంటలన్నీ ధ్వంసం
తడిసిన ధాన్యం కొనుగోలుపై మాటలకే పరిమితం
17 శాతం తర్వాత ఒక్కో శాతం తేమకు క్వింటాకు కిలో ధాన్యం తగ్గింపు
వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యపు రాశులు
దిక్కుతోచని స్థితిలో కౌలురైతులు



ఆచంటలో నేలకొరిగిన వరి పైరు

అన్నదాత.. ఆర్తనాదాలు..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అన్నదాత ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి. తడిసిన ధాన్యం, నేలకొరిగిన పంట పొలాలను చూసి రైతులు గుండెలు బాదుకుంటున్నారు. కొట్టుకుపోయిన ధాన్యపురాశులు చూసి గుండెలవిసేలా కన్నీరుమున్నీరవుతున్నారు. జిల్లాలో దాదాపు 68 వేల ఎకరాల్లో పంటకు ముప్పు వాటిల్లింది. ధాన్యం కొనుగోలులో ఆలస్యం కారణంగానే పెద్దఎత్తున ధాన్యం తడిసి ముద్దయినట్లు చెబుతూ రైతులు విలపిస్తున్నారు. గడిచిన 24 గంటల్లో సరాసరిన 181.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

మిచౌంగ్ తుపాను ప్రభావంతో గడిచిన 24 గంటల్లో జిల్లాలో సరాసరిన 181.5 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో జిల్లా రైతాంగం తీవ్ర నష్టాన్ని చవిచూసింది. వరి, మొక్కజొన్న, మినుము, పెసర, వేరుశెనగ, పొగాకు, పత్తి పంటలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన వచ్చిన పంట కళ్లముందే వరద పాలవ్వడంతో రైతుల ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి. ధాన్యపు రాశులు తడిసి ముద్దవ్వడమే కాకుండా పలుచోట్ల ధాన్యం కొట్టుకుపోయిన పరిస్థితి ఉంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నేలకొరిగి నీటిలో నానుతున్న పంట చేతికొస్తుందో, లేదో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా 1,93,398 ఎకరాల్లో రైతులు వరిసాగు చేయగా ఇప్పటి వరకూ 89,542 ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. ఇంకా 1,03826 ఎకరాల్లో పంట కోతలు కోయాల్సి ఉంది. దాదాపు 3.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి పంట మాసూళ్లు పూర్తి కావాల్సి ఉండగా తుపాను రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లావ్యాప్తంగా 68,055 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. దీనిలో 41,473 ఎకరాలు వరిపంట, మిగిలిన పంటలు మొక్కజొన్న, మినుము, పెసర, వేరుశెనగ, పొగాకు, పత్తి వంటివి ఉన్నాయి. వరి పంటలకు సంబంధించి 27 మండలాల పరిధిలోని 347 గ్రామాల్లో 14,400 ఎకరాల్లో పంట ముంపునకు గురవ్వగా 27,033 ఎకరాల్లో పంట నేలనంటింది. దీంతో రైతులకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. 650 ఎకరాల్లో మిరప, బొప్పాయి, అరటి, కూరగాయలు, పామాయిల్ వంటి ఉద్యాన పంటలు తుపానుకు దెబ్బతిన్న పరిస్థితి ఉంది.

తడిసిన ధాన్యంపై ధర కోత

జిల్లావ్యాప్తంగా మాసూళ్లు చేసి కళ్లాల్లోనే ఉన్న ధాన్యం దాదాపు 12 వేల మెట్రిక్ టన్నులు ఉంటుందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పలుచోట్ల రాశులు పూర్తిగా మునిగిపోయిన పరిస్థితి ఉండగా, పలుచోట్ల అడుగుభాగం తడిసిన పరిస్థితి ఉంది. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలు ఎక్కడా అమలుకాని పరిస్థితి ఉంది. రైతులకు ఎటువంటి నష్టమూ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా, 17 శాతం తర్వాత తేమశాతం ఒక్కింటికి క్వింటాల్‌కు కిలో ధాన్యం కోత కోసే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చిన పరిస్థితి ఉంది. తడిసిన ధాన్యం రోడ్లపై ఆరబెట్టేందుకు చోటులేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా కొనుగోలు చేసే పరిస్థితి లేకుండాపోయింది. తేమశాతం పేరుతో ఇబ్బందులు సృష్టించడం కారణంగానే తమ ధాన్యం వర్షానికి తడిసిపోయినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కైకరం, పోతునూరు వంటి గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దాదాపు 90 వేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తవ్వగా కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం కేవలం లక్షా టన్నులు ఉన్నట్లే. చాలావరకూ ధాన్యం అయినకాడికి రైతులు దళారులకే అమ్ముకున్న పరిస్థితి ఉంది.

దిక్కుతోచని స్థితిలో కౌలురైతులు

జిల్లావ్యాప్తంగా వివిధపంటలు సాగుచేసిన వారిలో 70 శాతానికిపైగా కౌలురైతులే ఉన్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. తుపానుకు పంటను కోల్పోవడంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కౌలురైతుల పేర్లు వెబ్‌ల్యాండ్‌లో లేకపోవడంతో పంట నష్టపరిహారం సైతం భూయజమానుల జేబుల్లోకి వెళ్లిపోయే పరిస్థితి నెలకొంది. కౌలురైతులను ఆదుకోకపోతే పరిస్థితి అత్యంత దారుణంగా మారనుంది.

ధాన్యం తడిసే.. అదనపు ఖర్చు పెరిగే



బెరెడి లక్ష్మణరావు, సుంకరవారితోట

ఐదెకరాల్లో వరి మాసూళ్లు చేశాను. ఇళ్ల స్థలాల ప్లాట్లల్లో ఆరబెట్టి రాశులు చేసిన ధాన్యం తడిసి ముద్దయిపోయింది. 200 సారాలు తడిసిపోయాయి. ధాన్యం రంగుమారితే ఎంతకు కొనుగోలు చేస్తారో తెలీదు. ఇప్పుడు అదనంగా రూ.20 వేలకుపైగా ఖర్చవుతోంది.

తొమ్మిదెకరాల ధాన్యం కొట్టుకుపోయింది



చిలుకూరి శ్రీనివాసరావు, కౌలురైతు, కైకరం

ఖరీఫ్‌లో తొమ్మిదెకరాలు సాగు చేశాను. మాసూళ్లు పూర్తిచేసి కైకరం రైల్వేగేటు దగ్గర్లో ధాన్యం రాశులుగా చేశా. తుపానుకు ఎర్రకాలువ గండ్లు పడి వరద రావడంతో తొమ్మిదెకరాల ధాన్యం కొట్టుకుపోయింది. ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. అధికారులెవ్వరూ చూసి వెళ్లారు. ప్రభుత్వం ఆదుకోకపోతే కుటుంబం మొత్తం రోడ్డున పడతాం. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాను.

సాధారణ పరిస్థితులకు కృషి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

తుపాన్ ప్రభావిత ప్రాంతాలపై రూపొందించిన కార్యాచరణను రానున్న మూడు రోజులు పకడ్బందీగా అమలు చేసి సాధారణ పరిస్థితులు ఏర్పడేందుకు కృషి చేయాలని కలెక్టర్ ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధికారులతో సమావేశమై రానున్న మూడు రోజులు కార్యాచరణ అమలుకు చేపట్టాల్సిన చర్యలపై ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 13,677 హెక్టార్ల విస్తీర్ణంలోని పంటలపై తుపాను ప్రభావం పడిందన్నారు. దీనిలో 13,311 హెక్టార్లలో వరి పంటపై ప్రభావం ఉందన్నారు. ఉద్యాన పంటల నష్టంపై సమగ్రంగా పరిశీలించి నివేదిక అందజేయాలని ఉద్యాన శాఖాధికారిని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖాధికారిని ఆదేశించారు. ఎర్రకాలువ, యనమదుర్రు డ్రెయిన్లకు ఎగువ నుండి వస్తున్న నీటిని ఎప్పటికప్పుడు గమనించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. పంట పొలాల్లో నీరు చేరిన వివరాలను మండలా లవారీగా సేకరించి, నీటిని తొలగించేందుకు చర్యలను ముమ్మరం చేయాలన్నారు. ఇరిగేషన్ శాఖకు చెందిన ప్రతి ఉద్యోగి, అధికారీ క్షేత్రస్థాయిలోనే ఉండాలని ఆదేశించారు. వైద్య శిబిరాలు పెద్దఎత్తున నిర్వహించాలని, డెంగీ, మలేరియా పరీక్షలతోపాటు, ఫీవర్ సర్వేను కూడా చేయించాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు. జిల్లాలోని అన్ని పంచాయతీలు, పట్టణాల్లో పారిశుధ్య పనులను పెద్దఎత్తున చేపట్టాలని, అవసరమైన చోట తాగునీటి వనరులను శుభ్రం చేయించాలని డిపిఒ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన వాటిని వెంటనే పునరుద్ధరించాలని విద్యుత్ శాఖాధికారి ఆదేశించారు. పశువులకు వ్యాక్సినేషన్‌ను వెంటనే పూర్తి చేయాలని జిల్లా పశువైద్యాధికారిని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఉండి ఇంటికి వెళ్తున్న సందర్భాల్లో ప్రతి కుటుంబానికీ రూ.2,500 చొప్పున జమ చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికీ 25 కిలోల బియ్యం, కందిపప్పు ఒక కేజీ, పామాయిల్ ఒక లీటరు, ఉల్లిపాయలు ఒక కేజీ, బంగాళాదుంపలు ఒక కేజీ వస్తువులను సిద్ధం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలకు వచ్చిన వారి నుండి తమకు నగదు జమ కాలేదని, నిత్యావసర వస్తువులు అందలేదనే మాట రాకూడదని రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్‌ఒ బి.శ్రీమన్నారాయణరెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కె.సంగీత్‌మాధుర్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ టి.శివరామప్రసాద్, డిఎస్‌ఒ ఎన్.సరోజ, ఉమ్మడి జిల్లాల మార్కెటింగ్ అధికారి కె.సునీల్‌కుమార్, జిల్లా జల వనరుల అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, డ్రెయినేజీ ఇఇ దక్షిణామూర్తి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎ.దుర్గేష్, కలెక్టరేట్ ఎఒ వైకెవి.అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రైతులకు అండగా ప్రభుత్వం : కారుమూరి

ప్రజాశక్తి - మొగల్తూరు

భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ ఆందోళన చెందొద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకటనాగేశ్వరరావు హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని గ్రామాల్లో ఆర్‌డిఒ ఎం.అచ్యుత్‌అంబరీష్‌తో కలిసి పర్యటించారు. మునిగిన వరిచేలను, ధాన్యపు రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా రైతుల నుంచి మిల్లర్లు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వ జారీ చేసిందన్నారు. ఆయన వెంట తహశీల్దార్ జి.అనితకుమారి, వ్యవసాయ శాఖాధికారి ఎస్.అబ్దుల్‌రహీమ్, అధికారులు ఉన్నారు.

నరసాపురం: మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మండలంలోని లిఖితపూడి, లక్ష్మణేశ్వరం గ్రామాల్లో నీటమునిగిన వరి పంటలను, లిఖితపూడిలో టొర్నాడో వలన దెబ్బతిన్న గృహాలు, కొబ్బరి చెట్లను పరిశీలించారు. బాధి తులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టొర్నాడో చాలా దారుణంగా వ్యవసాయాన్ని దెబ్బతీసిందన్నారు. తుపాను, అధిక వర్షాల కారణంగా జిల్లాలో సుమారు 15 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగిందన్నారు. టొర్నడో బాధితులను కచ్చితంగా ఆదుకుంటామన్నారు. వారివెంట ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, తహశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, వ్యవసాయ శాఖాధికారులు ఉన్నారు.



మొగల్తూరు: రైతులతో మాట్లాడుతున్న మంత్రి

తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తడిచిన ధాన్యాన్ని నిబంధనలతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలి
ఎకరాకు రూ.20 వేలకుపైగా నష్టపరిహారం అందించాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు

మిచౌంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వేలాది ఎకరాలు నీట మునిగాయని, పంట రాలిపోతుందని, మాసూళ్లకు పనికి రాకుండా పోయిందని, ధాన్యం రాశులు తడిచి ముద్దయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తుపాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.20 వేలకుపైగా నష్ట పరిహారం చెల్లించాలని, ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విస్సాకోడేరులో బుధవారం సిపిఎం బృందం దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించింది. ఈ సందర్భంగా రైతులు అనేక సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం బలరాం మాట్లాడుతూ తుపానుతో చేతికొచ్చిన పంట చేజారిపోయిందన్నారు. రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి దీనస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న, చిన్నకారు రైతులు, కౌలురైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. ఇప్పటికే ఎకరాకు మాసూళ్లు చేయకుండానే రూ.30 వేల వరకూ పెట్టుబడులు పెట్టారని చెప్పారు. తడిచిన ధాన్యాన్ని నిబంధనలతో సంబంధం లేకుండా మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దాళ్వా సాగుకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందించాలన్నారు. ఈ బృందంలో సిపిఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రియ్య, నాయకులు గోపాల్‌రాజు, వెంకన్న, రైతులు ఉన్నారు.



భీమవరం రూరల్: వెంపలో

విస్సాకోడేరు సచివాలయం వద్ద రైతుల నిరసన

విస్సాకోడేరు సచివాలయం వద్ద బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో తుపాన్ బాధిత రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య మాట్లాడగా నేతలు కలిదిండి గోపాల్‌రాజు, ఆనంద్, వెంకన్న, సత్తిబాబు, రమణ, దుర్గ పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల యజమానులను ప్రభుత్వం ఆదుకోవాలి: సిపిఎం

వీరవాసరం: సుడిగాలి విధ్వంసంతో రైతులు, గృహ యజమానులతోపాటు రైలుమిల్లుల యజమానులు కూడా తీవ్రంగా నష్టపోయారని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. అందరిలానే ప్రభుత్వం వీరిని కూడా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సుడిగాలికి దెబ్బతిన్న మిల్లులు, షెడ్లను సిపిఎం బృందం బుధవారం పరిశీలించింది. వీరవాసరంలో రెండు మిల్లులకు కలిగిన నష్టం సుమారు రూ.కోటి వరకు ఉంటుందని, వాటి యజమానులు తెలిపారన్నారు. కెపి మిల్లు ధాన్యం ఆరబెట్టే డ్రయ్యర్ పూర్తిగా దెబ్బతిందన్నారు. ఇదే విధంగా దాని పక్కనే ఉన్న మిల్లు పైకప్పు రేకులు ఎగిరిపోయాయన్నారు. తక్షణమే రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మిల్లులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి, పరిహారం అందించి వాటిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాల్సి ఉందన్నారు. సుడిగాలి వల్ల పలు వ్యాపార షెడ్లు, ఇంటి పైకప్పులు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. వెంటనే ప్రభుత్వం వాటికి కలిగిన నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలన్నారు. ఆయన వెంట సిపిఎం నేతలు జుత్తిగ నరసింహమూర్తి, ఆకుల హరేరాం, యాళ్లబండి నారాయణమూర్తి, బొర్రా ఆలమహారాజు, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు ఉన్నారు.



ఉండిలో



పాలకోడేరు: దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ఉండి: తుపాన్‌కు నష్టపోయిన ప్రతి రైతుకూ తగిన నష్ట పరిహారం అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించిన అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ వరితోపాటు ఆక్వా రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. అధికార యంత్రాంగం మండలంలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని, రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆక్వా రైతులను సైతం ఆదుకునేందుకు చర్యలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు చీర్ల శేషు, చీర్ల శ్రీనివాస్, కొట్టాడ వెంకటేశ్వరరావు, మోపిదేవి రాము, పి.ఆంజనేయులు, మామిడాల మహంకాళి, సావు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట: భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. బుధవారం ఆచంట, ఆచంట వేమవరం, పెనుమంచిలి గ్రామాల్లో పంట పొలాలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గోపాలన్ పంట నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆచంట వేమవరంలో పంట పొలాల్లో మురుగునీరు లాగేలా కాకరపర్రు బ్యాంక్ కెనాల్ లాకుల నుంచి నీరు రాకుండా తాత్కాలింగా నిలుపుదల చేస్తే తప్ప మురుగునీరు కిందకి లాగే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వద్దిపర్తి అంజిబాబు, తలుపూరి బుల్లబ్బాయి, నెక్కంటి కృష్ణమూర్తి, సిర్రా నరసింహమూర్తి, రైతులు ఆరుమిల్లి నారాయణరావు, గుబ్బల చంద్రశేఖర్, వర్ధనపు శ్రీరాములు పాల్గొన్నారు.

పోడూరు: మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ బృందం బుధవారం పోడూరు, పెనుమదం, గుమ్ములూరు, పండితవిల్లూరు, జగన్నాధపురం తదితర గ్రామాల్లో పర్యటించి రైతులను కలిసి మాటాడింది. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాటాడారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి బొంతు శ్రీను, గెద్దాడ ధవళనేత్రుడు, అధికారి గంగాజలం, రాపాక వెంకటేశ్వర్లు, కాటూరి యాకోబు, బొక్కా సింహాచలం, గోవిందరాజు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, దీంతో వర్షాల సమయంలో జనం అవస్థలు పడుతున్నారని, తక్షణమే కచ్చా డ్రెయిన్లు తవ్వించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం వెంప కొత్తపేటలో సిపిఎం నేతలు పర్యటించారు. సమస్యను గ్రామ కార్యదర్శి జి.కృష్ణమోహన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించి నీరు నిల్వ ఉన్నచోట వెళ్లే విధంగా కచ్చా డ్రెయిన్ తవ్విస్తానని చెప్పారని శ్రీనివాస్ తెలిపారు.

వీరవాసరం: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి పుట్టెడు కష్టాల్లో ఉన్న కౌలురైతులను, పేదరైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ తుపాను, గాలికి పంటలు పడిపోయి నీట మునిగాయన్నారు. కొన్నిచోట్ల ధాన్యపు రాశులు నీట మునిగాయన్నారు. తడిచిన ధాన్యం మొలకెత్తకుండానే ప్రభుత్వం కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించాలని, కౌలు కార్డులు లేని, పంట నమోదు కాని కౌలురైతుల పంటను ఎడిట్ ఆప్షన్ ద్వారా కౌలురైతుల పేరున నమోదు చేసి పంట నష్టం వారికే ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని మండలంలో పర్యటిస్తున్న విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి తక్షణం ధాన్యం మిల్లులకు తరలిస్తామని తెలిపారన్నారు. అయితే తడి ధాన్యం కొనేందుకు ప్రభుత్వం నిర్దిష్ట ధర నిర్ణయించకపోవడంతో మిల్లర్లు చేతివాటం ప్రదర్శిస్తారేమోనని, అధికారులు గందరగోళానికి, రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. తక్షణం కలెక్టర్ నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కౌలురైతులు జి.చినవెంకటేషులు, అబ్రహం, తాతయ్య, ఆశీర్వాదం, కిశోర్ పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర): తుపాన్ నష్టపోయిన రైతాంగాన్ని ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం ఇచ్చి అన్ని విధాలుగా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. బుధవారం ఆలమూరు, పొలమూరు గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యంలో నేలకొరిగిన పంట పొలాలను, ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కుసంపూడి సుబ్బరాజు, నేతలు చింతపల్లి తిరుమలరావు, పిల్లి సాయి, కట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు: మిచౌంగ్ తుపాను ధాటికి చేతికందిన పంటను కోల్పోయిన కౌలురైతులు, పేద రైతులకు ఎకరాకు రూ,.20 వేలకుపైగా నష్ట పరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని అరట్లకట్ట, లంకలకోడేరు, భగ్గేశ్వరం తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించామని ఆయన పాలకొల్లులో మీడియాతో మాట్లాడారు. తక్షణం కౌలురైతుల పేరున పంటనష్టం నమోదు చేసి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలురైతులు దిగమర్తి అబ్బులు, చింతపల్లి వెంకటనారాయణ, మామిడిశెట్టి రాంబాబు, బొక్కా శ్రీనివాసరావు, వలవల నరసన్న పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే గుణపాఠం తప్పదు

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఝాన్సీలక్ష్మి
జిల్లావ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలకు వినతులు అందజేత

ప్రజాశక్తి - భీమవరం

అంగన్వాడీల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న వైసిపి ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.ఝాన్సీలక్ష్మి అన్నారు. అంగన్వాడీల ఆందోళనల్లో భాగంగా అంబేద్కర్ వర్ధంతి నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఏడు ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంబేద్కర్ విగ్రహాలకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను బుధవారం సమర్పించారు. భీమవరం అర్బన్, భీమవరం రూరల్, గణపవరం, తాడేపల్లిగూడెం, మొగల్తూరు, వీరవాసరం ప్రాంతాల్లో వినతిపత్రాలు అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మీ మాట్లాడారు. తెలంగాణ కంటే అదనంగా రూ.వెయ్యి వేతనం ఇస్తామని ఇచ్చిన హామీ ముఖ్యమంత్రి జగన్ అమలు చేయలేదని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ అంగన్వాడీలపై నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. పని ఒత్తిడి భారంతో అంగన్వాడీలు సతమతమవుతూ మానసికంగా, ఆర్థికంగా కష్టాల పాలవుతున్నారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాడ్యూటీని అమలు చేయాలన్నారు. అంగన్వాడీలకు పెన్షన్లు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో నేతలు అనురాధ, హసీనాబేగం, వై.రాణి, తులసి, విజయలక్ష్మి, రాజమణి, పెద్దింట్లు, రాజేశ్వరి, నాగరత్నం, మార్తమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.



పాలకోడేరులో..



పెనుగొండలో..

మొగల్తూరు: అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అంబేద్కర్ 67 వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు జి.పెద్దింట్లు, జి.రాజేశ్వరి, నేతలు ఎ.సీతారత్నం, కె.జ్యోతి, కె.కామాక్షి, పి.రాజీ పాల్గొన్నారు.



గణపవరంలో..

ఆచంట: అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి కోరారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆచంటలో ఆయన విగ్రహానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఈ నెల 8 నుంచి నిరవధిక సమ్మె చేయనట్లు తెలిపారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, తక్షణమే వాటిని మెయిన్ కేంద్రాలుగా మార్చాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు మైలే విజయలక్ష్మి, సుజాత, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, సత్యవతి, శ్రీదేవి, వెంకాయమ్మ పాల్గొన్నారు.

పెనుగొండ: అంగన్వాడీలు స్థానిక పంచాయతీ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలదండ నివాళులర్పించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ప్రాజెక్ట్ లీడర్ కె.తులసి మాట్లాడుతూ లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీలతోపాటు సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు పాల్గొన్నారు.

గణపవరం: అంగన్వాడీలు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు ఎమ్‌డి.హసీనాబేగం, కె.ఝాన్సీలక్ష్మి మాట్లాడగా శాంతికుమారి, మహాలక్ష్మి, పిబి.లారెన్స్ పాల్గొన్నారు.



ఆచంటలో

రైతులు అధైర్యపడొద్దు

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి రైతుకు వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని సిఎం జగన్ అన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో పాటు తడిచిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామన్నారు. 80 శాతం రాయితీపై విత్తనాలు అందించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎం క్యాంపు కార్యాలయం నుంచి సిఎం సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ప్రత్యేకాధికారి కె.కన్నబాబు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్‌పి యు.రవిప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ వర్షాల వల్ల ఇళ్లు దెబ్బతిన్న వారికి రూ.10 వేలు ఇచ్చే విషయంలోనూ, వర్షాల కారణంగా ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల వారిని క్యాంపులకు తీసుకొచ్చి వారిని చూసుకునే విషయంలోనూ, క్యాంపుల నుంచి తిరిగి ఇళ్లకు వెళ్తున్న సందర్భంలోనూ వారికి ఇవ్వాల్సిన సహాయం అందించాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన అత్యధిక ప్రాధాన్యతతో విద్యుత్‌ను పునరుద్ధరించాలని చెప్పారు.

జిల్లాలో మిచౌంగ్ నష్టం రూ.188 కోట్లు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

తుపాన్ కారణంగా జిల్లాలో సుమారు 23,661 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని, మౌలిక వసతులు దెబ్బ తినడం వల్ల సుమారు రూ.188 కోట్ల నష్టం వాటిల్లిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 19 మండలాల్లోని 113 గ్రామాలు తుపాను కారణంగా ఏర్పడిన తీవ్ర వర్షాలు, ఈదురు గాలులు తాకిడికి గురయ్యాయని తెలిపారు. పాక్షికంగా దెబ్బతిన్న గృహాలకు సుమారు రూ.14 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. 32 పశువుల పాకలు దెబ్బతినగా సుమారు రూ.3.2 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు సుమారు రూ.11 కోట్లు ఖర్చవుతుందని, శాశ్వత నిర్మాణాలకు సుమారు రూ.165 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి 9.7 కిలోమీటర్ల మేర ఆరు రోడ్లు దెబ్బతినగా తాత్కాలిక మరమ్మతులకు సుమారు రూ.42 లక్షలు, శాశ్వత నిర్మాణాలకు రూ.130 లక్షలు ఖర్చవుతుందన్నారు.16 ప్రదేశాల్లో పారిశుధ్య నిర్మాణాలు దెబ్బతిన్నాయని, వాటిని పునరుద్ధరించడానికి సుమారు రూ.53 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. మున్సిపల్ రహదారులు, వీధి దీపాలు ఏర్పాటు దెబ్బతినడం కారణంగా రూ.8 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. 33 కెవి ఫీడర్ లైన్స్ మూడు, 11 కెవి ఫీడర్ లైన్స్ 15, 33/11 కెవి సబ్‌స్టేషన్ రెండు, 11 కెవి పోల్స్ 22 దెబ్బతినగా మొత్తం నష్టం సుమారు రూ.13 లక్షలు వాటిల్లిందని తెలిపారు.

గుడిమిల్లి కోడు తవ్వకానికి రూ.3.60 లక్షలు

ప్రజాశక్తి - పాలకోడేరు


ప్రారంభిస్తున్న మురుగుకోడు పనులు

మోగల్లు జగనన్న కాలనీని ఆనుకుని ఉన్న గుడిమిల్లి కోడు పూడికతీతకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన ఈ కోడు తవ్వకం పనులు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలు ఇవ్వడంతో పాటు కోడు పూడికతీత నిమిత్తం రూ.3.60 లక్షలు మంజూరు చేశారు. దీనిలో భాగంగా బుధవారం ఇరిగేషన్ ఎఇ దుర్గారావు ఆధ్వర్యంలో కోడు పూడికతీత పనులు ప్రారంభించారు. జగనన్న కాలనీకి పక్కనే భారీగా ఆక్వా చెరువులు ఉన్నాయి. ఈ కాలనీకి పక్కనే గుడి మిల్లు కోడు కూడా ఉంది. ఆక్వా చెరువుల నీరు ఈ కోడులోకి వదిలేయడంతో పూడిక పోయింది. నీరంతా జగనన్న కాలనీని ముంచెత్తుతుంది. ఈ నేపథ్యంలో ఇటీవల జగనన్న కాలనీవాసులంతా భీమవరం-తణుకు రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఆ సమయంలో ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్‌తో పాటు స్థానిక అధికారులు సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ప్రశాంతి స్పందించి కిలోమీటర్ పొడవున్న కోడు తవ్వకం నిమిత్తం రూ.3.60 లక్షలు మంజూరు చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా ఈ కోడు పూడికతీత పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమ ంలో జిల్లా గృహ నిర్మాణ శాఖాధికారి ఆనంద్‌కుమార్, సర్పంచి మల్లిపూడి కృష్ణకు మారి, తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నాగేంద్ర కుమార్, హౌసింగ్ డిఇ శివరా మరాజు, పాలకోడేరు హౌసింగ్ ఎఇ నరసింహరావు, ఆర్ఐ నాగభూషణం నాయుడు, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రాజు, విఆర్ఒలు పంపన సురేష్, తులసి పాల్గొన్నారు.

బస్టాండ్‌ను పునరుద్ధరించండి

ప్రజాశక్తి - ఉండి

మండల కేంద్రమైన ఉండిలోని ఆర్‌టిసి బస్టాండ్‌ను పునరుద్ధరించాలని సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం నాయకులు బస్టాండులో బుధవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారులు స్పందించి బస్టాండ్‌లో నిల్వ ఉన్న మురుగునీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చీరల శేషు, కొట్టాడ వెంకటేశ్వరరావు, మామిడాల మహంకాళి, పి.ఆంజనేయులు, మోపిదేవి రాము, సావు వెంకన్న పాల్గొన్నారు.

భూ హక్కు చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

భూ హక్కు చట్టం రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి బుధవారం రాష్ట్రపతి రోడ్డులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ యాక్ట్-27 వల్ల భూ యజమానులు నష్టపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కలిదిండి పద్మావతి, జిఎంవిఎస్.ప్రసాద్, డి.పద్మావతి, ఎస్‌కె.మోతి, చింతపల్లి నాగేశ్వరరావు, ఎడ్లపల్లి రాధాకృష్ణ, ఆర్.శ్రీనివాసరావు, బి.రవికుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొవ్వూరి అప్పిరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరిస్తూ బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో సహ కార్యదర్శి దాసరి ఏకాంత, మహిళా కార్యదర్శి గీతా రెడ్డి, కార్యవర్గ సభ్యులు ముళ్లపూడి శ్రీనివాసరావు, అద్దంకి విజయరత్నం, న్యాయవాదులు గాజుల గోపీకృష్ణ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

ఓటర్ జాబితాలో మరణించిన వారి ఓట్లు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ సుబ్రహ్మణ్యం అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని నినాదంతో బుధవారం అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేరాలు - ఘోరాలు

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఆచంట (పెనుమంట్ర) : ఎదురెదురుగా రెండు మోటార్ సైకిళ్లు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన ఘటన ఆలమూరు శివారు పెట్రోల్ బంక్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆచంట పంచాయతీ పరిధి రావి గుంటకు చెందిన భార్యాభర్తలు పెనుమంట్ర వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నారు. అదే సమయంలో విస్సాకోడేరు గ్రామానికి చెందిన భార్యాభర్తలు మార్టేరు వైపు మోటార్ సైకిల్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో ఆలమూరు పెట్రోల్ బంకు వద్ద రెండు మోటార్‌సైకిళ్లు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికు లు స్పందించి క్షతగాత్రులను 108 వాహనంలో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి : మండలంలోని చినపుల్లేరు పరిధిలోని తల్లమ్మచెరువు శివారులో పేకాట స్థావరంపై ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తన సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8600 నగదును, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మిచౌంగ్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ బుధ వారం పర్యటించారు. మండలంలోని కడియద్ద, కృష్ణాపురం, నీలాద్రిపురం గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించి వర్షపు నీటిలో మునిగిన పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుందన్నారు. మంత్రితో పాటు తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కె.చెన్నయ్య, అగ్రికల్చర్ ఎడిఎ.మురళీకృష్ణ, ఎఒ ఆర్ఎస్. ప్రసాద్, కొమ్ముగూడెం సొసైటీ ఛైర్మన్ వెలిశెట్టి నరేంద్ర కుమార్, కడియద్ద, నీలాద్రిపురం సర్పంచులు యాతం కోటేశ్వరి బూరయ్య, రాజమహేంద్రవరపు లక్ష్మణ రావు, దారపురెడ్డి శ్రీనివాస్, నీలాద్రిపురం ఎంపిటిసి సభ్యులు మట్టా సత్యనారాయణ, ఇన్‌ఛార్జి తహశీల్దార్ శివశంకం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పవన్ పాల్గొన్నారు. మండలంలోని పుల్లయి గూడెం, అప్పరావుపేట గ్రామాల్లో పంటలను జనసేన తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను మానవత దృక్పథంతో ఆదుకుని తక్షణ సాయం కింద ఎకరానికి రూ.20 వేలు అందించాలని కోరారు.

వీరవాసరం : రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయడానికి సిఎం జగన్ ఆదేశాలు జారీ చేశారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. తుపాన్ కారణంగా వీరవాసరం మండలంలో నేలకొరిగిన పంట పొలాలను, సుడిగాలితో నష్టపోయిన గృహాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, జెసిఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, తహశీల్దార్ ఎం.సుందర్‌రాజు, ఎంపిడిఒ జ్యోతి, వ్యవసాయ శాఖ ఎడి సిహెచ్.శ్రీనివాస్, ఎఒ బిన్నీబాబు, భోగిరెడ్డి శ్రీను, మండపాక రాంబాబు, మేకా శ్రీనివాస్, కడలి శ్రీరాములు, చికిలే మంగతాయారు, ఎర్రంశెట్టి శ్రీనివాస్, నాగరాజు శ్రీనివాసరాజు, నూకల కనకారావు, పొలిశెట్టి దాసు, ఇంటి రాఘవేంద్ర, గడ్డం భాస్కరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు డిమాండ్ చేశారు. ఆ పార్టీ మొగల్తూరు మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు టిడిపి నాయకులతో కలిసి వరిచేలను, తుపాన్ ప్రభావిత ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. అనంతరం తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఆయనతో పాటు కత్తిమండ ముత్యాలరావు, రత్నంరాజు, ఏడుకొండలు, రాంబాబు, గోపాలం, రాంబాబు, పంపన భగవాన్, పుల్లారావు ఉన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : తుపాన్‌కు పంట నష్టాన్ని అధికారులు అంచనా వేస్తే ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందేలా చేస్తామని రైతులకు ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు హామీ ఇచ్చారు. తుపాన్‌కు నేలకొరిగిన సోమరాజు ఇల్లింద్రపర్రు, జుత్తిగ, మాముడూరు, పొలమూరు, ఆలమూరు, భట్లమగుటూరు గ్రామాల్లో పంట పొలాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసురెడ్డి), తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఎఒ జ్యోషిల, ఎంపిడిఒ పి.పద్మజ, ఇరిగేషన్ ఎఇ సత్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తుపాన్ తాకిడికి నీట మునిగిన పంట పొలాల్లో నీటిని తరలించేందుకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ దండు అశోక్ వర్మ, ఎఒ ఎ.జ్యోషిల, ఇరిగేషన్ పెనుమంట్ర ఎఇ సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఇల్లింద్రపర్రులో మల్లిపూడి, జుత్తిగ, నత్తారామేశ్వరం, మాముడూరు నీట మునిగిన పంటపొలాలను తహశీల్దార్ దండు అశోక్‌వర్మ, ఇరిగేషన్ ఎఇ సత్యనారాయణ, భట్లమాగుటూరు, ఆలమూరు, మార్టేరు, వెలగలేరు, ఓడూరు గ్రామ పంట పొలాలను ఎఒ ఎ.జ్యోషిల పరిశీలించారు. మండలంలో జుత్తిగ, పొలమూరు గ్రామాల్లో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు పర్యటించారు. ఆయనతో పాటు సానబోయిన శ్రీను, కె.వెంకటసోమిరెడ్డి, జి.మల్లారెడ్డి, జుత్తిగ వెంకటేశ్వర్లు, సోమిరెడ్డి పాల్గొన్నారు.

యలమంచిలి : తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి తప్పకుండా నష్ట పరిహారం అందేల కృషి చేస్తామని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరిగోపాలరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నీటమునిగిన వరి పొలాలను అధికారులు, వైసిపి శ్రేణులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపిపి రావూరి వెంకట రమణ బుజ్జి, వైసిపి నాయకులు, ఎంపిడిఒ త్రిశూల పాణి పాల్గొన్నారు. తుపాను ప్రభావంతో మండలంలోని చింత దిబ్బ, ఏనుగువానిలంక గ్రామాల్లోని నీటమునిగిన నివాస ప్రాంతాల బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు మోజేష్‌కుమార్ కోరారు. ఆయా గ్రామాల్లో బుధవాయం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతదిబ్బ, ఏనుగువానిలంక గ్రామాల్లో పదుల సంఖ్యలో దళిత పేటల్లోని ఇళ్లు నీటిలో మునిగి పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

పోడూరు : మండలంలోని పెనుమదం పంచాయితీ పరిధిలోని చిట్టితగుంట ఏరియాలో నీట మునిగిన వరి పొలాలను ఆర్‌డిఒ ఎం.అంబరీష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం తరపున తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఆయనతో పాటు తహశీల్దార్ కృష్ణారావు, మండల వ్యవసాయ శాఖ అధికారి జి.సత్యనారాయణ, ఆర్ఐ కె.రాంబాబు పాల్గొన్నారు.మించౌంగ్ తుపాన్ రైతుల కంట కన్నీరు మిగిల్చింది. మూడు రోజులుగా కురిసిన వర్షం వల్ల చేతికొచ్చిన పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా 40 శాతం వరకు వరి కోతలై కొంతవరకు మిల్లులకు తోలారు. మిగతా 60 శాతం చేలలో నానుతూ ఉంది. నీటిలో ఇంకొక రెండు రోజుల పాటు ఉంటే ధాన్యం మొలకలు వచ్చే అవకాశం ఉంది. తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

భీమవరం రూరల్ : మిచౌంగ్ తుపానుతో సర్వం కోల్పోయిన రైతన్నకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం సత్వరమే చెల్లించి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. తుపాన్ కారణంగా నేలకొరిగిన పంటపొలాలను, తడిసిన ధాన్యం రాశులను సిపిఐ ప్రతినిధి బృంద సభ్యులు బుధవారం కొవ్వాడ, అన్నవరంలో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు నాగిడి నరసింహమూర్తి పాల్గొన్నారు. మిచౌంగ్ తుపాన్‌తో మండలంలో 3500 ఎకరాలు పంట దెబ్బ తిన్నట్లు మండల వ్యవసాయాధికారి ఎ.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని తుందుర్రు, తాడేరు గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను తహశీల్దార్ రవికుమార్, వ్యవసాయ, ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు బుధవారం పరిశీలించారు.

ఉండి : రైతులెవరూ అధైర్యపడొద్దని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భీమవరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు అన్నారు. భీమవరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలో బుధవారం పర్యటించి మిచౌంగ్ తుపాను ప్రభావంతో ముంపునకు గురైన వరి పొలాలను, డ్రెయినేజీలను పరిశీలించారు. బొండాడ డ్రెయినేజీలోని తూడు చెత్తాచెదారాన్ని పొక్లెయిన్‌తో తీయించారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు సహ వ్యవసాయ సంచాలకులు కెవిఎస్ఎస్.శ్రీనివాస్, ఇరిగేషన్ డిఇ పివిఎన్ఎస్.మూర్తి, డ్రెయినేజీ ఎఇ ప్రకాష్, తహశీల్దార్ ఏడిద శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య, గ్రామ వ్యవసాయ సహాయక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భీమవరం : మిచౌంగ్ తుపాను వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని, ప్రతి ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని అఖిలభారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు లంక కృష్ణమూర్తి కోరారు. తుపాన్ ప్రభావిత ప్రాంతంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యవర్గ సభ్యులు దండు శ్రీనివాసరాజు, కనుమూరి వెంకటపతిరాజు, తిరుమణి వనమరాజు, మోకా పరమేశ్వరరావు పాల్గొన్నారు.

పెంటపాడు : మిచౌగ్ తుపాను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పెంటపాడు ప్రజా సంఘాల కార్యాలయం వద్ద రైతు సంఘం ముఖ్య నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పుల్లారెడ్డి, నాయకులు కరక వెంకట్రావు మాట్లాడుతూ మిచౌంగ్ తుపాన్ వల్ల రైతులు నష్టపోయారన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చల్ల చంద్రరావు, గొర్రెల శ్రీను, పెనగంటి దుర్గ, తెర్లి కృష్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

వరి రైతులను ఆదుకోవాలి

కాళ్ల : మండలంలోని కోమటిగుంటలో అకాల వర్షాలకు నష్టపోయిన వరి చేలను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు, కాళ్ల మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్ అందించాలన్నారు. తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకు ఏ ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాన్నారు. కౌలు రైతులకు కూడా నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మేకా కాశీచరణ్, ఓగిరాల రాజేష్, పసుపులేటి మహేష్, ఇర్రింకి జగన్, ఆరేటి దిలీప్, గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు. మిచౌంగ్ తుపాన్ వల్ల నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు డిమాండ్ చేశారు. మండలంలోని కాళ్ల, దొడ్డనపూడి గ్రామాల్లో అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోడదాసి గంగయ్య, అంకెం సీతారాం, కొల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెనుగొండ : మిచౌంగ్ తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు మండలంలోని పెనుగొండ మేజర్ పంచాయతీ కాలనీలోని వీధులు నీటి మునిగాయి. పంట బోదెలు పూర్తిగా పూడికపోయ్యాయి. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎర్ర నారాయణస్వామి, అంబేద్కర్ కాలనీలు, రామచంద్రపేట రోడ్లు నీట మునిగాయి. పెను గొండ గ్రామంలో పంట పొలాలను కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ పరిశీలించారు. కౌలురైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

పాలకొల్లు : వైసిపి ప్రభుత్వం ఈ నాలుగున్నర సంవత్సరాల్లో మురుగు డ్రెయిన్లను పట్టించుకోకపోవడం వల్లే పట్టణంలో పలు ప్రాంతాలు వర్షపు నీటికి ముంపునకు గురయ్యాయని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ముంపు ప్రాంత వాసులు తమ అవస్థలను ఎంఎల్‌ఎ వద్ద మొర పెట్టుకున్నారు. 27వ వార్డు ఛాంబర్స్ కళాశాల వెనుక నివాస కాలనీ వాసులు ఇళ్లలో వంట చేసుకునే అవకాశం కూడా లేకపోవడంతో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టిబాబు, జివి, కర్నేన గౌరు నాయుడు, మామిడిశెట్టి పెద్దిరాజు, కొలాటి పెద్దిరాజు, కడలి గోపాలరావు, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, బోనం నాని, జాని, కోడి విజయభాస్కర్, జడ్డు రాజేష్, పెన్మెత్స రామభద్రరాజు, కేశవ, అప్పారావు, ముప్పిరి సత్యనారాయణ, ఖండవల్లి నరేంద్ర పాల్గొన్నారు.

ఆచంట : తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని తహశీల్దార్ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని ఆచంట, కొడమంచిలి, కోడేరు, వల్లూరు, పెనుమంచిలి గ్రామాల్లో అధికారులు మంగళవారం పర్యటించి నష్టపోయిన రైతాంగానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా సర్వే చేసి నష్టపోయిన ప్రతిరైతుకు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఎంపిడిఒ నరసింహప్రసాద్, మండల విస్తరణ అధికారి, బి.నాగరాజు పాల్గొన్నారు.

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎంఎల్ఎలు, అధికారులు, నాయకుల పర్యటన

పాలకొల్లు రూరల్ : తుపాన్ బాధితులను ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు కోరారు. తుపాన్ ప్రభావంతో మండలంలోని వెలివెల, సాలివాడ, తిల్లపూడి ప్రాంతాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షంతో పాటు పెద్ద ఎత్తున నివాస ఇళ్ల పైకప్పులు పైకి లేచి ఎగిరిపోయాయి. గోడలు దెబ్బతిన్నాయి. విద్యుత్‌స్తంభాలు, వందలాది కొబ్బరి చెట్లు ఎక్కడికక్కడ పడిపోయాయి. పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు జోరు వాన లెక్కచేయకుండా తడుస్తూనే ఆ ప్రాంతాలకు వెళ్లి సహాయ ఏర్పాటల్లో నిమఘ్నమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు ధర్మారావు ఫౌండేషన్ ద్వారా అవసరమైన సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని లంకలకోడేరు, వెలివెల గ్రామాలో పంట పొలాలను, తడిచిన ధాన్యం రాశులను మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు.

నరసాపురం టౌన్ : తుపాన్ కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు బుధవారం పరిశీలించారు. మండలంలోని సీతారాంపురం, కొప్పర్రు, మల్లవరం, మల్లవరంలంక, లిఖితపూడి గ్రామాల్లో పర్యటించి రైతులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు రాధాకృష్ణ, తహశీల్దార్ ఎస్ఎం.ఫజిల్, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు, ప్రజా ప్రతినిధులు దొంగ మురళి, మైలాబత్తుల శ్రీను, అగ్రికల్చర్ ఎడి అనిల్‌కుమారి పాల్గొన్నారు. మండలంలోని లిఖితపూడి, మల్లవరం, మల్లవరంలంక, వేములదీవి వెస్ట్, బియ్యపుతిప్ప, పిఎంలంక గ్రామాల్లో జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ పర్యటించి రైతులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, కొల్లాటి గోపీకృష్ణ, బందెల రవీంద్ర, వాతడి కనకరాజు, నిప్పులేటి తారకరామారావు, తోట నాని, పొలిశెట్టి సాంబ, వట్టిప్రోలు సతీష్, గ్రంధి నాని పాల్గొన్నారు.

పాలకోడేరు : మండలంలోని కుముదవల్లి, పాలకోడేరు పలు గ్రామాల్లోని వరి చేలను ఎంపిపి భూపతిరాజు చంటిరాజు బుధవారం పరిశీలించారు. ఆయనతో పాటు కుముదవల్లి సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణంరాజు, ఇరిగేషన్ డిఇ ఎ.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.నాగేంద్రకుమార్, ఆర్ఐ ఎం.నాగభూషణనాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ సిహెచ్.తనూజ ఉన్నారు.

వీరవాసరం : వైసిపి ప్రభుత్వం వైఫల్యం వల్లే తుపాను వల్ల రైతులకు ఎక్కువ నష్టం వాటిల్లిందని టిడిపి, జనసేన జిల్లా అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి, కొటికలపూడి చినబాబు విమర్శించారు. మండలంలో తుపాను, సుడిగాలి వల్ల దెబ్బతిన్న వరి చేలను, ఇళ్లను బుధవారం వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, టిడిపి మండలాధ్యక్ష కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీనివాసరావు, వీరవల్లి చంద్రశేఖర్, ఎంపిటిసి సభ్యులు గుల్లిపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆకివీడు : మిచౌంగ్ తుపాన్ కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని వైసిపి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆకివీడు వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ నంద్యాల లక్ష్మీసీతారామయ్య, ఎఎంసి ఛైర్మన్ షేక్ రసూల్ బిబి హుస్సేన్ అన్నారు. గుమ్మలూరు రోడ్డులో నేలకొరిగిన వరి పొలాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడిఎ శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ పుప్పాల సత్యనారాయణ, యువ నాయకులు అంబటి రమేష్, ఎఒ ప్రియాంక పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని గరగపర్రు సాంఘిక బహిష్కరణ బాధితులు పిలుపునిచ్చారు. స్థానిక సచివాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక బహిష్కరణ బాధితులు కర్తాక యేసు, కటికితల యోహాను, డొల్ల యోన, దాసరి ఇస్సాకు, వెలగపల్లి రమేష్, గోడి డేవిడ్‌రాజు, దొండపాటి ఏసెబు, అద్దంకి సురేష్‌బాబు పాల్గొన్నారు. గొరగనముడి శ్రీ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. విస్సాకోడేరు పెద్దపేట యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి మాజీ సర్పంచి దుండి అశోక్‌బాబు, దళిత నేత నగేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎపిఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్, భీమవరం శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి అసోసియేషన్ అధ్యక్షులు ఎ.వీరయ్య పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల విచ్చేశారు.

ఆచంట (పెనుమంట్ర) : మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎడిఆర్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అధ్యక్షత వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎడిఆర్ ఎం.భరతలక్ష్మి మాట్లాడుతూ అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ఇతర సిబ్బంది, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు, బోధనా బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. పెనుమంట్రలో సర్పంచి తాడిపర్తి ప్రియాంక ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మొగల్తూరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతిని మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మొగల్తూరు మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, ఎస్‌సి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు డోల్లా రత్నంరాజు, కత్తిమండ ముత్యాలరావు, కలిదిండి కుమార్‌బాబు, పాల రాంబాబు, గోపాలం, బస్వాని ఏడుకొండలు, వెలుది పుల్లారావు టిడిపి నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఉప సర్పంచి బోణం నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి జయరాజు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది నివాళులర్పించారు.

ఆచంట : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. మండలంలోని ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, కంద్రవల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట, వేమవరం, శేషమ్మ చెరువు. అయోధ్యలంక గ్రామాల్లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు ఈ కార్యక్రమంలో సర్పంచి కోట సరోజినీవెంకటేశ్వరరావు, బీర నరసింహమూర్తి, ఎల్లమెల్లి రాజేష్, నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పునరంకితం కావాలని, రాజ్యాంగాన్ని కాలరాయడానికి జరుగుతున్న కుట్రలను తిప్పి కొట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా భీమవరంలో అంబేద్కర్ కాంస్య విగ్రహానికి ఆయన సిపిఐ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, జిల్లా సమితి సభ్యులు నాగిడి శాంతమూర్తి, మల్లుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీరవాసరం : వీరవాసరం పంచాయితీ వద్ద సర్పంచి చికిలే మంగతాయారు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాయకుదురులో సర్పంచి గెడ్డంభారతీ భాస్కరరావు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నూకల కనకారావు, నేతల జ్ఞానసుందరాజు, గౌరి, జోత్స్నదేవి, చిక్కాల రాజు, పి.దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది, ఆటో యూనియన్, కవురు శ్రీనివాస్, పులిదిండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుగొండ : దేవ సిద్ధాంతం గ్రామంలో అంబేద్కర్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నల్లూరి సత్యనారాయణ, ఉప సర్పంచి సుబ్రహ్మణ్యం, పెనుగొండ, సిద్ధాంతం సర్పంచులు శ్యామల, సోనియా, గన్నిరాజు, కెవిపిఎస్ నాయకులు కప్పల రత్నరాజు, చిన్నం ఏడుకొండలు పాల్గొన్నారు.

పాలకొల్లు : కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ అధ్యక్షతన అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులఅర్పించారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలికేట్ మహబూబా జానీ, కో-ఆర్డినేటర్స్ కొలుకులూరి అర్జున్‌రావు, రొక్కాల బెన్నీపాల్ పాల్గొన్నారు.

ఆచంట : పెదమల్లంలో అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

కెవిపిఎస్ ఆధ్వర్యంలో..

తాడేపల్లిగూడెం : మతోన్మాద బిజెపి నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, అదే అంబేద్కర్‌కి ఇచ్చే ఘన నివాళని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ దేశంలో ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాలను అనుసరించే బిజెపి రాక్షస పాలన సాగిస్తుందన్నారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని పాందువ్వలో కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ సృష్టికర్త బిఆర్.అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడ్డారన్నారు. నేటికీ సమాజంలో దళిత పేటలు అభివృద్ధికి నోచుకోలేదని, డ్రెయినేజీ సౌకర్యాలు లేక దళితుల ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో ఇటీవల దళితులపై దాడులు ఎక్కువవుతున్నాయని, అధికారులు, నాయకులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు, ఎన్.వెంకన్న, ఎం.ప్రశాంత్, ఎం.లవకు మార్, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, ఎల్.నాగరాజు పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితాన్ని దేశ ప్రజలు యువత ఆదర్శంగా తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ అన్నారు. అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో బుధవారం పెనుమంట్ర, జుత్తిగ గ్రామాల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కె.కృష్ణ, కె.చింటూ, కె.బాలు, ఆశీర్వాదం, తిరపతయ్య పాల్గొన్నారు.

గణపవరం : కెవిపిఎస్ మండల కార్యదర్శి చెన్నం చిన్న నాగేశ్వరరావు అన్నారు. బుధవారం పిప్పర, తాళ్లపాలెం, జల్లి కాకినాడలో జరిగిన సభల్లో కెవిపిఎస్ మండల కార్యదర్శి చెన్నం చిన్ననాగేశ్వరరావు అన్నారు. నిరంతర పోరాటమే అంబేద్కర్‌కి ఇచ్చిన నిజమైన నివాళన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.